క్లుప్తంగా

నేటి నుంచి మంత్రి పెద్దిరెడ్డి పర్యటన


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు పర్యటించనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. 9న తిమ్మానాయనపల్లె, గొంగివారిపల్లె, అమ్మగారిపల్లె, సదుం, రెడ్డివారిపల్లె, చింతపర్తివారిపల్లె పంచాయతీల పరిధిలోని 33 గ్రామాల్లో ఆయన పర్యటిస్తారని వారు చెప్పారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేస్తారన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి..


ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి

పుంగనూరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సోమవారం పట్టణంలో పర్యటిస్తారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 1, 2, 31 వార్డుల్లో పర్యటిస్తారని తెలిపారు. ప్రజలను ఎంపీ నేరుగా కలుసుకుని, సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ


బెల్లంమడుగులో భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

బైరెడ్డిపల్లి: భగవద్గీత పఠనంతో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని త్రైత సిద్ధాంత సేవా సమితి అధ్యక్షుడు అశోక్‌బాబు, బాలాజీ అన్నారు. మండలంలోని పట్నపల్లె, బెల్లంమడుగు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేసి, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భోగి, సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు వాణిశ్రీ , ఝాన్సీ, హరి, ప్రసాద్, సిద్ధు, భాస్కర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

పుంగనూరు: మదనపల్లె రెండో ఆర్టీసీ డిపో నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మేనేజర్ నిరంజన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2న పౌర్ణమి సందర్భంగా బస్సులు నడుపుతున్నామన్నారు. టికెట్ ధర రూ.790గా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మేల్‌మరత్తూరు ఆలయానికి 40 మందితో వెళ్లేవారికి ఒకొక్కరికి రానుపోను చార్జీలు రూ.830గా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు డిపో, 9959225677 నంబర్‌లో సంప్రదించి రిజర్వేషన్ చేసుకోవాలన్నారు.

బీసీ జనగణన చేపట్టాలి


బీసీ జనగణన చేపట్టాలని కోరుతున్న బీసీ సంఘ నేతలు

పలమనేరు: రాష్ట్రంలోనూ బీసీల జనగణన చేపట్టాల్సిన అవసరం ఉందని బీసీ సంఘం నాయకులు పూసల రవి పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని వన్నెకుల క్షత్రియ సంఘ భవనం వద్ద ఆదివారం ఆ సంఘం కులస్తుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జనగణన చేపట్టి దామాషా ఆధారంగా చట్టసభల్లో బీసీలకు యాభైశాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వన్నెకుల క్షత్రియ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బలిజ సంఘం సభ్యులు

వి.కోట: ఆదివారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ బలిజ కులస్తులందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, బలిజ సంఘం సభ్యులు కృష్ణమూర్తి, మురళి, శివ, వేణుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కుడి..ఎడమైతే పొరబాటేనోయి..!

కర్నూలు జిల్లాకు చెందిన ఓ పక్షవాత రోగిని అతడి కుటుంబ సభ్యులు కారులో పలమనేరు సమీపంలోని విరుపాక్షపురం పక్షవాత ఆస్పత్రికి వెళ్లేందుకు వచ్చారు. పలమనేరు సమీపంలోని చెన్నై- బెంగళూరు హైవేలో ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద కుప్పం మార్గంలో వెళ్లకుండా నేరుగా వెళ్లి కర్ణాటకలోని నంగిళి దాటేశారు. అనుమానం వచ్చి అక్కడెవర్నో అడిగితే మీరు చాలా దూరం వచ్చేశారని, ఆర్టీఓ ఆఫీసు వద్దే పక్కకు వెళ్లాల్సిందని చెప్పారు. విధిలేక వారు తిరిగి వెనక్కి తిరిగి వచ్చారు. ఇలా ఈ మార్గంలో కుప్పం క్రాస్ తెలియక నిత్యం కర్ణాటకలోకి వెళ్లి.. వెనక్కి వచ్చేవారు పదుల సంఖ్యలోనే ఉంటారు.


చెన్నై- బెంగళూరు హైవే నుంచి కుప్పం వెళ్లే మార్గం

- ఆదమరిస్తే కర్ణాటకకు వెళ్లి రావాల్సిందే!
- పలమనేరు, కుప్పం విడిపోయే చోట కనిపించని సూచిక బోర్డులు
- సర్వీసు రోడ్డంతైనా లేని హైవే క్రాసింగ్‌లోని రాష్ట్ర రహదారి
- ఇదీ చెన్నై- బెంగళూరు ఎన్‌హెచ్-4 హైవేలో దుస్థితి

కుడి..ఎడమైతే పొరబాటు లేదోయ్ అన్నాడో సినీ కవి.. అయితే చెన్నై- బెంగళూరు హైవేలో అదే జరిగితే.. కర్ణాటకలో తేలుతారు. తీరా మేలుకున్నాక చూసుకుంటే పదుల కిలోమీటర్ల దూరం వెనక్కి రావాల్సిందే. అది అత్యవసరమైనా.. ఆపదైనా.. సమయం వృథా కాక తప్పదు. ఇందుకు కారణం సూచిక బోర్డులు లేమి.. మరీ కనిపించని రీతిలో ఇరుకైన రోడ్డే ఉండడమే కారణమని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలమనేరు: చెన్నై- బెంగళూరు హైవేలోని ప్రధాన క్రాసింగ్‌ల వద్ద కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాలు చాలా చిన్నరోడ్లు ఉండడంతో తరచూ వాహనచోదకులు అయోమయానికి గురవుతున్నారు. పదుల కిలోమీటర్ల దూరం వెళ్లి, వెనక్కి తిరిగి రావాల్సి వస్తోంది.

పలమనేరు క్రాస్‌లో పొరపాటు పడితే...

చిత్తూరు నుంచి పలమనేరుకు వచ్చేవారు పట్టణ సమీపంలోని ఆంజినేయస్వామి ఆలయం వద్ద హైవే నుంచి పక్కకు వెళ్లే రాష్ట్ర రహదారిలో వస్తే పట్టణంలోకి చేరుకుంటారు. అయితే హైవే నుంచి పలమనేరులోకి వచ్చే మార్గం వద్ద సూచిక బోర్డులు లేవు. దీంతోపాటు రోడ్డు సైతం చాలా చిన్నగా కనిపించకుండా ఉంది. హైవేలో వేగంగా వెళ్లే వాహనాలు దారిని చూసుకోకుండా నేరుగా వెళ్లి, మళ్లీ గంగవరం నుంచో లేక నాగమంగళం, క్యాటిల్‌ఫామ్ ఫ్లైఓవర్ వద్ద యూటర్న్ తీసుకుని రావాల్సిన పరిస్థితి నెలకొంది.

కుప్పం రోడ్డూ అదే పరిస్థితి

పలమనేరు నుంచి కుప్పం పట్టణానికి (ఎన్‌హెచ్-219) వెళ్లాలంటే స్థానిక హైవే నుంచి ఆర్టీఓ కార్యాలయానికి సమీపంలో ఎడమవైపు మార్గంలో వెళ్లాలి. కానీ అక్కడ రోడ్డు క్రాస్ అవుతున్నట్టు కొత్తగా వచ్చేవారికి ఏమాత్రం కనిపించదు. ముందుగా అక్కడ క్రాస్ ఉందనే సమాచారం తెలిపేలా బోర్డులు లేవు. దీంతో వాహనచోదకులు నేరుగా ఫ్లైఓవర్‌పైకి వెళ్లి కర్ణాటక రాష్ట్రంలోని నంగిళి నుంచి వెనక్కి నాలుగురోడ్లు, పత్తికొండల మీదుగా కుప్పం రోడ్డులోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి పాత ఎన్‌హెచ్-4లో ఈ క్రాస్‌ల వద్ద పలమనేరు, కుప్పం మార్గాలను సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వాహనచోదకులు కోరుతున్నారు.

కనులపండువగా గోదా కల్యాణం


పూజా సామగ్రిని తీసుకువెళుతున్న వైష్ణవ సంఘం సభ్యులు

వి.కోట: పట్టణంలోని శ్రీరుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మండల వైష్ణవుల ఆధ్వర్యంలో ఆదివారం గోదా కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అనంతరం వేదపండితులు ధనుర్మాస విశిష్టతను తెలియజేశారు. వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సతీమణి భాగ్యమ్మ, ఎంపీపీ యువరాజు, ఎంపీడీఓ బాలాజీ, వైష్ణవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1981–82 సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి విద్యార్థులు కలుసుకుని, అప్పటి సంగతులు గుర్తు చేసుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి విషయాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధికి పలువురు పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమని హెచ్‌ఎం ఫజురుల్లా తెలిపారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు పెద్ద మునుస్వామినాయుడు, రామచంద్రారెడ్డి, రాజారెడ్డి, ముద్దుకృష్ణమనాయుడు తదితరులను సన్మానించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక


సుప్రియ


తనూజ

రొంపిచెర్ల: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రత్యేకాధికారి సుజాత తెలిపారు. ఆమె ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 20వ తేదీన తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన సుప్రియ, తనూజ అండర్ 19 విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. విద్యార్థులను ఎస్‌ఓ సుజాత, పీఈటీ షాహీరా, ఉపాధ్యాయులు అభినందించారు.

పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నేడు

సోమల: మండల కేంద్రంలో పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు షావలి తెలిపారు. క్రికెట్ పోటీలను వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, అభినయ్ రెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు. ప్రతిభ చూపిన జట్టుకు మొదటి బహుమతి రూ. 39,999, ద్వితీయ బహుమతి రూ.19,999 అందిస్తామని చెప్పారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


అరగొండ బీసీ కాలనీలో భగవద్గీత గ్రంథాలపై ప్రచారం చేస్తున్న సభ్యులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ బీసీ కాలనీల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. భగవద్గీత సారాంశం ప్రకారం సంక్రాంతి అంటే గుణాలపై తిరుగుబాటు అని తెలిపారు. ఉత్తరాయణంలో మోక్షం పొందే అవకాశం ఉంది గనుక మనుషులకు అసలైన పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. దక్షిణాయంలో చివరిరోజును భోగిపండుగ అంటారు. అనేక జన్మల కర్మలను కాల్చుకుని యోగులు ఉత్తరాయణంలో మోక్షం పొందుతారని వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ధనుంజయ, సభ్యులు రాజేంద్ర, ధర్మేష్, మహీధర్, లలిత, చిట్టెమ్మ, కల్యాణి, శ్రావణి, నాగమ్మ, జ్ఞానావతి పాల్గొన్నారు.

'చలో బెంగళూరు' విజయవంతం చేయండి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

పలమనేరు: బెంగళూరులో ఈనెల 11వ తేదీన జరిగే మాదిగల సింహగర్జన కార్యక్రమం కోసం చేపట్టనున్న చలో బెంగళూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక మాదిగ రిజర్వేషన్ కమిటీ, మహాజన సోషలిస్ట్ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నేతల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, మాదిగలకు మేలు కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాదిగ రిజర్వేషన్ సమితి నాయకులు వెంకటాచలం, హరికృష్ణ, ఈశ్వర్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

మేలు జాతి పశువులను సంరక్షించుకోవాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ముగిసిన జాతీయస్థాయి పశువుల పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ స్థాయిలో ఒంగోలు జాతి ఎద్దులకు ఎంతో గుర్తింపు ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని భారతీయ విద్యాభవన్స్‌లో మూడ్రోజులుగా జరిగిన జాతీయ స్థాయి ఆరో మేలు జాతి పశువుల అందాలు, పాల పోటీలు ముగింపు సభను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కొట్టు మాట్లాడుతూ మేలు జాతి పశు సంపదను వృద్ధి చేసి భావితరాలకు అందించాలన్నారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ పెద్ద రైతులు మినహా చిన్న, సన్నకారు రైతులు పశుపోషణకు దూరంగా ఉంటున్నారని, వారందరినీ ప్రోత్సహించాలని అన్నారు. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే, దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ మేలు జాతి గోవుల సంరక్షణలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మేలు జాతి పశువుల వీర్యాన్ని తాను ఉచితంగా అందిస్తున్నానన్నారు.

55 యూనిట్లు మంజూరు

పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేంద్ర మాట్లాడుతూ గోజాతి సంరక్షణ పథకంలో భాగంగా గతేడాది రూ.30 లక్షల విలువైన 55 యూనిట్లు మంజూరు చేశామని, ఈ ఏడాది మరో 55 యూనిట్లు మంజూరు చేశామన్నారు. ఆంధ్ర గోపుష్టి కార్యక్రమం ద్వారా విజయవాడలో అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి దేశీయ గోజాతి ఉత్పత్తులను విక్రయిస్తున్నామని, త్వరలో అన్ని జిల్లాల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయన్నారు. శాస్త్రవేత్త రాజీవ్‌కుమార్ జోషి, కామధేను యూనివర్సిటీ డీన్ భరత్ రాథోడ్, దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ సభ్యుడు కేవీవీ సత్యనారాయణరాజు (అబ్బాయిరాజు), కొప్పాక వెంకటనారాయణ, ఉప్పలపాటి చక్రపాణి, పశుసంవర్ధకశాఖ అధికారులు డీఎం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మేలు జాతి అందాల పోటీల విజేతలు

- ఒంగోలు జాతి ఆవుల విభాగంలో.. కూనమనేని మాధవి, దేవభక్తుని సుబ్బారావు
- ఒంగోలు జాతి ఎద్దుల విభాగంలో.. నల్లమోతు వేణుగోపాల్, ఎం.బాలాజీ
- పుంగనూరు ఆవుల విభాగంలో.. బి.సతీష్, మల్లిపూడి వెంకట్రావు
- పుంగనూరు ఎద్దుల విభాగంలో.. అడబాల లక్ష్మీనారాయణ (నాని), రెడ్డి సత్తిబాబు
- ముర్రా గేదెల విభాగంలో.. మల్లిపూడి వెంకట్రావు, టి.దుర్గాభవన్‌చౌదరి
- దేశీయ ఆవుల విభాగంలో.. బాలాజీ మానిక్‌రావు జాదవ్, దేవికాజ్ నార్వేడీలకు చెందిన పాడి పశువులు చాంపియన్, రిజర్వు చాంపియన్‌లుగా నిలిచారు.
- చాంపియన్‌లకు రూ.30 వేలు, రిజర్వు చాంపియన్‌లకు రూ.20 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

కారు ఢీకొని కోఆప్షన్ సభ్యుడికి గాయాలు


గాయపడిన మస్తాన్ సాహెబ్

సోమల: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు మస్తాన్ సాహెబ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. బస్టాండ్ కూడలిలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న మస్తాన్ సాహెబ్‌ను సదుం వైపు నుంచి వచ్చిన ఓ కారు వేగంగా వచ్చి, ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆయనకు స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, అనంతరం పీలేరుకు తరలించారు.

మొగిలీశ్వరుడిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామివారిని ఆదివారం జిల్లా కలెక్టర్ హరినారాయణ్ దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కామాక్షి సమేత శ్రీమొగిలీశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. కలెక్టర్‌కు ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.

తెలుగు సంస్కృతి..సంప్రదాయాలకు చిహ్నాలు


ముగ్గులు వేస్తున్న హాస్టల్ విద్యార్థినులు


బహుమతులు అందుకున్న విజేతలతో ఎంఈఓ సాయిలీల

వి.కోట: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ముగ్గులు చిహ్నమని, దాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికే ముగ్గులు పోటీలు నిర్వహించామని బాలికల బీసీ హాస్టల్ అధికారి ఉమాదేవి అన్నారు. ఆదివారం పట్టణంలోని బీసీ బాలిక హాస్టల్‌లో సంక్రాంతి పండగను పురస్కరించుకుని రంగవల్లికల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలైన 29 మంది విద్యా ర్థినులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టత, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు

బైరెడ్డిపల్లి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లె ఆదర్శపాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీ లు కోలాహలంగా సాగాయి. బాలికలు, మహిళలు ఈ ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. ఆకర్షణీయంగా ముగ్గుల వేసిన మహిళలకు ఎంఈఓ సాయిలీల ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఏటా కళాతరంగిణి సంస్థ నిర్వాహకులు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాతరంగిణి వ్యవస్థాపకుడు రాజేష్‌బాబు, సీఆర్పీ రామచంద్ర, ఉపాధ్యాయులు విమల, రామమోహన్, సురేఖ, చైతన్య పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ కంటి వైద్యశిబిరం


పరీక్షలు చేస్తున్న డాక్టర్లు శివ, శ్రీరాములు

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ, డాక్టర్ సరళ, క్లబ్ అధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కంటి జబ్బులున్న 75 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 24 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ శివ మాట్లాడుతూ ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి, కంటి అద్దాలు అందిస్తామన్నారు.

శ్రీవారి దర్శనానికి ఉచిత ఆర్టీసీ బస్సు


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న త్రిమూర్తిరెడ్డి

పుంగనూరు: తిరుమల వేంకటేశ్వరస్వామివారి దర్శనం చేసుకునే భక్తులకు సమరత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశారు. ఆదివారం ఆయన వనమలదిన్నెలో బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. త్రిమూర్తిరెడ్డి మాట్లాడుతూ తిరుమల శ్రీవాణిట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు దర్శనం కల్పిస్తారని తెలిపారు. 49 మంది భక్తులను ఉచితంగా పుంగనూరు నుంచి పంపుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ స్వామివారిని దర్శించుకుని, తరించాలని ఆయన కోరారు.

45 మంది భక్తులు తిరుమలకు పయనం

సోమల: మండలంలోని వల్లిగట్ల పంచాయతీ జమ్మలగుట్టకు చెందిన 45 మంది గ్రామస్తులు ఆదివారం తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి తరలి వెళ్లారు. వీరికి టీటీడీ దేవస్థానం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. ఉప సర్పంచ్ మాధవి ఆ బస్సును జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పం: మున్సిపల్ పరిధిలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సుధీర్ తెలిపారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని వెల్డర్లు, ఎలక్ట్రీషియన్లు, టైలర్, ఇంజినీరింగ్ వర్కర్లు, మెకానిక్‌లు కలసి మున్సిపాల్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ యూనియన్ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వర్కర్స్ యూనియన్ ప్రధాన సమస్య ఆటోనగర్ ఏర్పాటు అని, ఇందుకు ఇప్పటికే స్థల పరిశీలన చేస్తున్నామని, వీలైనంత తొందరగా ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తన సొంత హస్పిటల్ అయిన ప్రియా నర్సింగ్ హోమ్‌లో కార్మికులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసి, కార్మికులతోపాటు వారి కుటుంబసభ్యులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మునుస్వామి, కార్మిక సంఘం నాయకులు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నీవు లేవు..నీ పాట అజరామరం


పార్థసారథినాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- ఘనంగా ఘంటసాల శతజయంతి ఉత్సవాలు
- పలువురికి ఘన సన్మానం


అభినయం చేస్తున్న కళాకారులు

చిత్తూరు రూరల్: మూడు దశాబ్దాల పాటు దక్షిణాది రాష్ట్రాల సంగీత ప్రియులను తన గాన మాధుర్యంలో ఓలలాడించిన గాన గంధర్వుడు ఘంటసాల అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరం టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఘంటసాల అభిమానుల సంఘం, బలిజ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత కొందరు గాయకులు ఘంటసాల పాటలను ఆలపించి అలరించారు. అనంతరం ఆయన గీతాలకు నాట్యకారులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య భావావేశంతో ఘంటసాల పాడిన పాటలు ఆనాడు ప్రజలకు ఉత్తేజపరిచాయన్నారు. తెలుగు రాష్ట్రమంతా మారుమోగాయని తెలిపారు. అగ్రనటులకు వందలాది పాటలు పాడిన ఘంటసాల.. దాదాపు ఏడువేల పాటలకు గానం చేశారన్నారు. గానమే కాకుండా 125 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన ఘనత ఘంటసాలకే దక్కుతుందన్నారు. గాన గంధర్వుడు అమరలోకానికి తరలినప్పటికీ ఆయన పాడిన పాటలు నేటికీ అజరామరమని కొనియాడారు. చిత్తూరులో అభిమానులు శత జయంతి ఉత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురిని ఘనంగా జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఘంటసాల అభిమాన సంఘం నాయకులు రవినాయుడు, కోడికిషోర్, పార్థసారథినాయుడు, రాజరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో పలువురు ప్రముఖులు


జమ్ముకాశ్మీర్ న్యాయమూర్తికి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం జమ్ముకాశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ గందోత్రా, కర్ణాటక హైకోర్టు రిజిస్ట్రార్ రఘు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆలయానికి విచ్చేయగా ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగ తం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం చేయగా, అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.